సాక్షి సంగారెడ్డి

సోమవారం । 19 । ఫిబ్రవరి । 2024

పశువులతో కిక్కిరిసిన దర్గా ప్రాంతం



ఎద్దులు అధరహో..

- న్యాల్‌కల్ సంతకు భారీగా పశువులు
- వైభవంగా కొనసాగుతున్న ఉర్సు ఉత్సవాలు

న్యాల్‌కల్(జహీరాబాద్) : మండల కేంద్రమైన న్యాల్‌కల్ గ్రామ శివారులోని ఉర్సె షరీఫ్ పీర్ గైబ్ సాహెబ్ దర్గా ఉత్సవాల్లో భాగంగా జరిగిన సంతలో పశువుల ధర అదరహో అనిపించింది. ఏడాదికి ఒకసారి జరిగే ఈ సంతకు వివిధ రకాల జాతుల ఎద్దులను ఇక్కడికి తీసుకొచ్చి క్రయ విక్రయాలు జరుపుతారు. ఒక్కో ఎద్దు ధర లక్షల రూపాయలు పలకడం విశేషం. జాతర ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం ఇక్కడికి దియోనీ, చెర్నీ, ఒంగోలు తదితర జాతులకు చెందిన ఎద్దులు వచ్చాయి. ఈ సందర్భంగా ఓ జత ఎద్దులకు రూ.2.35 లక్షల భారీ ధర పలికింది. అలాగే ఉదయం హద్నూర్ గ్రామం నుంచి దర్గా వరకు గంధాన్ని బాజాభజంత్రీలతో తీసువచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అదేవిధంగా న్యాల్‌కల్‌కు చెందిన ఉపాధ్యాయుడు స్వర్గీయ అడివప్ప–గిరిజాబాయి, వారి మనుమడు సురేష్ స్మారకార్థం వారి కుమారుడు ప్రముఖ కళాకారుడు హోతి బస్వరాజ్ తన సొంత డబ్బులు వెచ్చించి మేలు రకం పశువులకు ప్రోత్సాహకాలు ప్రకటించారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ నాయకుడు మహమ్మద్ తన్వీర్, ఉత్సవ కమిటీ సభ్యులు గొల్ల నర్సింహులు, యూనుస్ ఖాన్, జగన్నాథ్, వాహబ్ తదితరులు పాల్గొన్నారు.


రూ.2.35 లక్షల ధర పలికిన ఎద్దుల జత

న్యూస్‌రీల్

కృష్ణ జింకకు గాయాలు


గాయపడిన జింకకు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

న్యాల్‌కల్(జహీరాబాద్): రోడ్డు ప్రమాదంలో కృష్ణ జింకకు గాయాలైన ఘటన మండల పరిధిలోని హుస్సెల్లి గ్రామ శివారులో చోటు చేసుకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ శివారులో అటవీ ప్రాంతం నుంచి రాత్రివేళ జింక బీదర్–జహీరాబాద్ రోడ్డు దాటుతుండా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో దాని వెనక రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన పంచాయతీ కార్యదర్శి నాగభూషణం జహీరాబాద్ ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. బీట్ ఆఫీసర్స్ వనజ, వరప్రసాద్, రత్నం తదితరులు ఘటనా స్థలానికి చేరుకొని గాయాలైన జింకను పరిశీలించారు. స్థానిక వైద్య సిబ్బందితో చికిత్స చేయించి హైదరాబాద్‌లోని నెహ్రూ జూపార్కుకు తరలించారు.

గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రంపై పోలీసుల దాడి



పటాన్‌చెరు : గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రంపై పోలీసులు దాడిచేసి సిలిండర్లు, వేయింగ్ మిషన్లు స్వాధీనం చేసుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధి ఇస్నాపూర్ చౌరస్తా నుంచి పాశమైలారం వెళ్లే దారిలో అక్రమ రీఫిల్లింగ్ కేంద్రం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. దాడుల్లో 12 పెద్ద సిలిండర్లు, 9 చిన్న సిలిండర్లు, 2 వెయింగ్ మిషన్లు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు మహ్మద్ గౌస్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వనదుర్గమ్మా.. దీవించమ్మా



ఏడుపాయల దుర్గమ్మ క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు దర్శనమివ్వగా బోనాలు తీసి, ఒడి బియ్యం సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. వనంలో టెంట్లు వేసుకొని విందు చేసుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా చైర్మన్ బాలాగౌడ్, సిబ్బంది, పోలీసులు చర్యలు తీసుకున్నారు. – పాపన్నపేట(మెదక్)

మల్లన్న క్షేత్రం..భక్తజన సంద్రం

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదో వారం భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలన్నీ సందడిగి మారాయి. సమ్మక్క సారక్క జాతరకు వెళ్లే భక్తులు స్వామి వారిని దర్శించుకుని మేడారం వెళ్తుండటంతో భక్తుల రద్దీ పెరిగింది. స్వామి దర్శనానికి ఉదయం నుంచే భక్తులు క్యూలైన్‌లలో బారులు తీరారు. గంగిరేణు చెట్టు వద్ద పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి ధర్మదర్శనానికి సుమారు 4గంటల సమయం పట్టింది. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి,ఆలయ ఏఈవో బుద్ది శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తలు, ఆలయ ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్‌తదితరులు పర్యవేక్షించారు.


ఆలయ పరిసరాలలో భక్తుల రద్దీ

యాసంగికి లేనట్టే?

- పంటల బీమాపై సర్కార్ కసరత్తు
- రైతుల వారీగా వివరాల సేకరణ
- వానాకాలం సీజన్‌లో అందే అవకాశం?
- యాసంగి పంటలను కూడా చేర్చాలని రైతుల డిమాండ్


వడగళ్ల వానకు నేలవాలిన పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు(ఫైల్)

జహీరాబాద్: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం రావడంతో పంటల బీమాలో మార్పు చేసే దిశలో ప్రయత్నాలు సాగుతున్నాయి. ప్రకృతి విపత్తుల కారణంగా పంటలు కోల్పోయి నష్టపోతున్న రైతులకు సాంత్వన లభించనుంది. ఇందుకు ప్రభుత్వం పంటల బీమా వర్తింపజేసేందుకు వీలుగా కార్యాచరణ సిద్ధం చేస్తోంది. మూడేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అమలు చేయలేదు. అయితే ప్రతి ఏటా ఏదో ఒక సీజన్‌లో అకాల వర్షాలు, వడగళ్లతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. దీన్ని కొంతలో కొంత పరిహారం రూపంలో పూడ్చి రైతుకు అండగా ఉండేందుకు ప్రస్తుత సర్కారు చర్యలకు పూనుకుంది. ఇందుకు అవసరమయ్యే కార్యాచరణపై జిల్లా స్థాయిలో అధికార యంత్రాంగం లెక్కలు తీస్తోంది. రైతులు ప్రధానంగా ఏయే పంటలను సాగు చేస్తారు? ఎక్కడ ఎలా నష్టపోతున్నారు? అనే దానిపై పాత రికార్డులను తీస్తున్నారు. ఇది ఇప్పటికిప్పుడు కార్యరూపం దాల్చే అవకాశం కనిపించడం లేదు. ఎందుకంటే ఇప్పటికే యాసంగి పంటలు వేశారు. వచ్చే వానాకాలం వరకు కార్యరూపం దాల్చితే తమకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని బాధిత రైతులు భావిస్తున్నారు.


నేలరాలిన మామిడి కాయలు

అకాల వర్షాలతో నష్టం

కేంద్ర ప్రభుత్వం 2016–17 యాసంగి నుంచి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలులోకి తీసుకువచ్చింది. గతంలో ఉన్న బీమా పాలసీలతో రైతులకు పెద్దగా ఉపయోగం లేకపోవడంతో అనేక సంస్కరణలు చేసి ప్రధాని మోదీ ఈ కొత్త పథకానికి శ్రీకారం చుట్టారు. ఇది రాష్ట్రంలో 2019–20 వరకు కొనసాగింది. దీనిద్వారా ఆశించిన ప్రయోజనం కలగడం లేదని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ భావించి పక్కన పెట్టారు. ఇందులో రైతుల కంటే బీమా కంపెనీలకే ఎక్కువ లబ్ధి చేకూరుతోందని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. దాని స్థానంలో కొత్తగా బీమా పథకం అంటూ ఏదీ రాలేదు. దీంతో రైతులు పంట నష్టపోయినప్పుడు అప్పటికప్పుడు ప్రభుత్వ పెద్దల నిర్ణయం వైపు చూడాల్సి వచ్చేది. గత ఏడాది అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్నప్పుడు సర్కారు ఎకరానికి రూ.10వేల పరిహారం ఇస్తామని ప్రకటించినా పూర్తి స్థాయిలో అమలు చేయలేదు. అదే బీమా కంపెనీలుంటే ప్రశ్నించే అవకాశం ఉండేదని రైతులు వాపోతున్నారు.

రైతు యూనిట్‌గా పరిశీలన

పంటల బీమా ఇదివరకు జిల్లా, మండల యూనిట్‌గా ఉండగా దాన్ని గ్రామాల వారీగా మార్చారు. అది పంటల వారీగా గుర్తించి ఇవ్వడం మొదలు పెట్టారు. ఇందులో కూడ నష్టపోయిన పంటలకు పూర్తిగా న్యాయం జరగడం లేదని భావించి.. ఈ సారి రైతు యూనిట్‌గా బీమా పథకం తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సూచనా ప్రాయంగా వెల్లడించింది. ఇందుకోసం వ్యవసాయ శాఖ అవసరమైన కసరత్తును మొదలు పెట్టింది. బీమా కోసం రైతు తన వంతుగా నామమాత్రం ప్రీమియం చెల్లిస్తే మిగతాది ప్రభుత్వమే కట్టేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రకృతి విపత్తులు వస్తే వ్యవసాయ శాఖ అధికారులే బీమా కంపెనీ ప్రతినిధులతో కలిసి సందర్శించి నష్టం అంచనా వేస్తారు. అప్పుడే సరైన పరిహారం ఇచ్చేందుకు వీలవుతుందని భావిస్తున్నారు. ఇప్పటికే యాసంగి సీజన్ మొదలు కావడంతో వచ్చే వానాకాలం నాటికి ఈ పథకాన్ని ఆచరణలోకి తెచ్చేందుకు చర్యలకు ఉపక్రమించారు.

గతేడాది భారీ నష్టం

గతేడాది మార్చి 16,17 తేదీల్లో కురిసిన వడగళ్ల వానకు జిల్లాలో 4,047 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. 3,093 మంది రైతులు నష్టపోయినట్లు అధికారులు నిర్ధారించారు. ఏప్రిల్ 27 నుంచి 30వ తేదీ వరకు కురిసిన భారీ వడగళ్ల వర్షం మిగిలిన పంటలను కూడా మింగేసింది. యాసంగిలో సాగు చేసిన మొక్కజొన్న, జొన్న, సోయాబీన్, తెల్లకుసుమ, శనగ పంటలతో పాటు బొప్పాయి, అరటి, టమాట, ఉల్లిగడ్డ, గోబి, క్యాబేజీ, వంకాయ తదితర కూరగాయలు దెబ్బతిన్నాయి. మామిడి పంట సైతం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయి అపార నష్టం జరిగింది. ఆయా పంటల సాగు కోసం ఎకరాకు సుమారు రూ.20వేల నుంచి రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టారు. పంటలు పూర్తిగా దెబ్బతినడంతో రైతులు అప్పుల పాలయ్యారు. అప్పట్లో ప్రభుత్వం ఎకరాకు రూ.10వేల వంతున పరిహారం అందిస్తామని చెప్పినా చేతులెత్తేసిందని రైతులు విమర్శిస్తున్నారు. ఇక ఆ పరిహారం అందుతుందనే ఆశలను వదులుకున్నట్లు రైతులు వాపోతున్నారు.

అలంకారం

జహీరాబాద్ టౌన్: పట్టణంలో కొన్ని నెలలుగా ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయడం లేదు. సాంకేతిక లోపమో.. ఇంకా ఏదో తెలియదు కానీ స్థానికంగా ఉన్న ఏ ఒక్క సిగ్నల్ లైట్ కూడా పనిచేయడం లేదు. దీంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. ఏ వాహనం ఎటు వెళ్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ట్రాఫిక్ నియంత్రణకు పట్టణంలోని భవానీ మందిర చౌరస్తా, బస్టాండ్, పస్తాపూర్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో సిగ్నల్ లైట్లను ఏర్పాటు చేశారు. ప్రారంభంలో చక్కగా పనిచేశాయి. దీంతో కొంతవరకు ట్రాఫిక్ సమస్య తొలగింది. కానీ కొన్ని నెలల నుంచి సిగ్నల్స్ పనిచేయకపోవడంతో వాహనాల రాకపోకలు ఇష్టానుసారంగా జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ లైట్స్‌కు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


జహీరాబాద్ పట్టణంలో అలంకారప్రాయంగా ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్

చిత్రలేఖనం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జాతీయ భద్రత దినోత్సవం సందర్భంగా ఆదివారం బీహెచ్ఈఎల్ కమ్యూనిటీ సెంటర్‌లో గృహ భద్రత, రహదారి పద్ధతి పై రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అదేవిధంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జాతీయ భద్రత మండలి తెలంగాణ చైర్మన్ రాజగోపాల్ రావు పాల్గొని మాట్లాడారు. చిన్నప్పటి నుంచే పిల్లలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో బెల్ జీఎం విజయ సాగర్, అరవింద్ కుమార్, డాక్టర్ వెంకటేశ్వర్లు, వెల్ఫేర్ అధికారి మాయ బ్రహ్మం, కమ్యూనిటీ సెంటర్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.


పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

వార్షికోత్సవం

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని హట్కర్ పేటలోని రామలింగేశ్వర మందిరంలో 25వ వార్షికోత్సవ ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. 21వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయి. ఈ సందర్భంగా వీరయ్యస్వామి ధనసిరి అప్పగారి ఆధ్వర్యంలో 25మంది దంపతులచే గణపతి హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వారాధి బస్వరాజ్, వీరశైవ లింగాయత్ సమాజం గౌరవ అధ్యక్షుడు శివచంద్రకుమార్ పాటిల్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఇప్పపల్లి నర్సింలు, ప్రధాన కార్యదర్శి అన్నిశెట్టి జయప్రకాష్ పాల్గొన్నారు.


హోమం నిర్వహిస్తున్న దంపతులు

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి : దామోదర

టేక్మాల్(మెదక్): విద్య, వైద్యరంగాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం మండలంలోని ఎల్లుపేటలో ఆరోగ్య ఉపకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో రూ.17 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకుల ఆశ్రమ పాఠశాలలను పరిశీలించి అసంపూర్తి పనులకు శంకుస్థాపన చేశారు. విద్యార్థుల కోరిక మేరకు మరో రూ. 3 కోట్లు మంజూరు చేస్తున్నట్లు హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గతప్రభుత్వం పదేళ్లలో విద్య, వైద్య వ్యవస్థలను భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. నాణ్యమైన, ప్రమాణాలతో కూడిన విద్యను అందించడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడించారు. ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందన్నారు.

కొత్త మండలాలకు రాలే?

- పాత ఎమ్మార్సీలకు మాత్రమే కంప్యూటర్ల పంపిణీ
- ఒక్కో కేంద్రానికి ఆరు చొప్పున అందజేత
- పలుచోట్ల సిబ్బంది కొరతతో ఇబ్బందులు


మండలాలకు వచ్చిన కంప్యూటర్లు(ఫైల్)

మునిపల్లి(అందోల్): విద్యాశాఖలో సాంకేతిక ఆధారంగా పారదర్శకత పెంపొందించేందుకు ఎమ్మార్సీలకు ప్రభుత్వం కంప్యూటర్లు పంపిణీ చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని పాత మండలాల్లోని 109 ఎమ్మార్సీలకు మాత్రమే కంప్యూటర్లు అందజేసి.. 9 కొత్త మండలాల ఎమ్మార్సీలకు పంపిణీ చేయలేదు. దీంతో ఎమ్మార్సీలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అలాగే కంప్యూటర్ ఆపరేటర్ల కొరతతో కార్యాలయాలు వెలవెలబోతున్నాయి.

కంప్యూటర్ల ఉపయోగం..

ఒక్కో ఎమ్మార్సీకి ఆరు కంప్యూటర్లు, ఒక ప్రింటర్ చొప్పున ప్రభుత్వం అందజేస్తుంది. ప్రతి మండలంలో యూడైస్, విద్యార్థుల వివరాలు, మధ్యాహ్న భోజనం అమలు, స్కూల్ యూనిఫాం, ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ, సర్వశిక్షా అభియాన్ ద్వారా చేపడుతున్న వివిధ రకాల కార్యక్రమాలన్నీ కంప్యూటర్‌లో పొందుపరుస్తారు. ఎమ్మార్సీలో ఎంఐఎస్ కోఆర్డినేటర్, ఒక డాటా ఎంట్రీ కంప్యూటర్ ఆపరేటర్ పని చేస్తారు.

మంజూరు..

జిల్లాలోని పాఠశాలలు, కేజీబీవీలకు 109 కంప్యూటర్లు అందజేశారు. పాఠశాలల్లో ప్రతీ 30 మంది విద్యార్థులకు ఒకటి చొప్పున, కేజీబీవీల్లో సంఖ్యను బట్టి 5, 8, 10 కంప్యూటర్లు మంజూరు చేశారు.

సిబ్బంది కొరత

పాత, కొత్త ఎమ్మార్సీలకు స్టాఫ్ కొరత ఉంది. కంప్యూటర్ల పంపిణీతో పాటు సరిపోను సిబ్బంది ఏర్పాటు చేయడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. ప్రతీ ఎమ్మార్సీకి 6 కంప్యూటర్లు పంపిణీ చేయగా.. ఇందుకు సంబంధించిన టేబుల్స్ రాలేదని ఆపరేటర్లు చెబుతున్నారు. ఎమ్మార్సీలకు ఉచిత ఇంటర్నెట్ సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం విద్యుత్, స్విచ్ బోర్డులు అమర్చే పనులు జరుగుతున్నాయి.

కొంత ఇబ్బంది తొలగినట్టే..



జిల్లాలోని వట్పల్లి, నాగల్‌గిద్ద, నిజాంపేట్, మొగుడంపల్లి, చౌటాకూర్, గుమ్మడిదల, అమీన్‌పూర్, కంది, శిర్గాపూర్ కొత్త మండలాలకు కంప్యూటర్లు మంజూరు కాలేదు. పాత మండలాల్లోని ఎమ్మార్సీ సెంటర్లకు కొత్త కంప్యూటర్లు వచ్చాయి. గతంలో ఒకటి రెండు కంప్యూటర్లు మాత్రమే ఉండటంతో సమస్యగా ఉండేది. ప్రస్తుతం వచ్చిన కంప్యూటర్లతో పనులు త్వరితగతిన నిర్వహిస్తారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్, కంప్యూటర్ డాటా ఎంట్రీ ఆపరేటర్, ఎంఈఓ, సీఆర్పీలు సైతం కంప్యూటర్లను వినియోగించుకునే అవకాశం లభించింది. **- వెంకటేశ్వర్లు, సంగారెడ్డి, డీఈఓ**

‘లోక్‌సభ’కు సమాయత్తం

జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల హడావిడి మొదలైంది. ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. పోలింగ్ బూత్‌ల సవరణకు వేగవంతంగా చర్యలు చేపడుతోంది. అసెంబ్లీ కంటే లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే పలు శాఖల్లో ఉద్యోగుల బదిలీలు జరిగాయి.

- ఏర్పాట్లలో అధికార యంత్రాంగం బిజీబిజీ
- ఇప్పటికే రాజకీయ పార్టీలతో సమావేశాలు
- జోరుగా అధికారులు బదిలీలు


గీతం యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ హాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి (ఫైల్)

నారాయణఖేడ్: పార్లమెంట్ ఎన్నికల హడావిడి ఊపందుకుంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు మొదలు పెట్టింది. ఇప్పటికే వీవీ ప్యాట్ల మొదటి విడత తనిఖీ కార్యక్రమాన్ని అధికారులు పూర్తి చేశారు. రాజకీయ నాయకుల సమక్షంలో ఓటింగ్ యంత్రాల పనితీరు పరిశీలించేందుకు మాక్ పోల్ నిర్వహించనున్నారు. తనిఖీ బృందాలైన ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎంసీసీ, వీవీటీ, ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు ఇస్తున్న శిక్షణ పూర్తికావొచ్చింది. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కు నమోదుకు అవకాశం కల్పించిన ఎన్నికల సంఘం ఫిబ్రవరి 8న తుది జాబితాను విడుదల చేసింది. శాసన సభ ఎన్నికల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మరోసారి సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తగిన ఏర్పాట్లు చేపడుతున్నారు. నియోజవకర్గ స్థాయిల్లో శిక్షణ ఇచ్చే సిబ్బందికి అవగాహన కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంది. రాజకీయ పార్టీల నాయకులతో ఇదివరకే సమావేశాలు నిర్వహించారు.

ప్రకటనలోపే అంతా సిద్ధం

జహీరాబాద్ లోక్‌సభ స్థానానికి జరిగే ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గాల వారీగా అధికారులు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ స్థానం పరిధిలో జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్, జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఆయా నియోజకవర్గాల వారీగా పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల ప్రకటన వచ్చే లోపు పూర్తి స్థాయిలో సన్నద్ధం కానున్నారు.

జోరుగా అధికారుల బదిలీలు

కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు లోక్‌సభ ఎన్నికలకు ముందు వివిధ స్థాయిల్లోని అధికారుల మూకుమ్మడి బదిలీలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోనే మండలస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్ అధికారులను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున బదిలీలు చేసింది. కేటాయించిన జిల్లాల్లో రిపోర్టులు చేయాలని ఆదేశించింది. ఎన్నికల వేళ సొంత జిల్లాలో విధులు నిర్వహిస్తున్న అధికారులను ఇతర జిల్లాలకు బదిలీ చేసింది. దీంతోపాటు ఒకే పోస్టులో మూడేళ్లుగా పనిచేస్తున్న వారు సైతం బదిలీ అయ్యారు. రెవెన్యూ శాఖలో తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, పంచాయతీరాజ్ శాఖలో ఎంపీడీఓలు, జెడ్పీ సీఈఓ, డీపీఓ, ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్లు, ఎక్సైజ్ సీఐలను బదిలీలు చేశారు.

క్లుప్తంగా

గ్రామాల్లోకి వన్యప్రాణులు



నెమలిని పోలీసులకు అప్పగిస్తున్న గ్రామస్తులు

చిన్నకోదూరు(సిద్దిపేట): పర్యావరణ సమతుల్యాన్ని కాపాడుతూ.. వాతావరణ కాలుష్యాన్ని నివారిస్తూ మానవ జాతి మనుగడకు ప్రాణధారంగా నిలువాల్సిన అడవులు కొందరి స్వార్థానికి అంతరించిపోతున్నాయి. దీంతో పచ్చని చెట్లు మధ్య తిరిగే పక్షులు, నెమళ్లు గ్రామాల్లో తిరుగుతున్నాయి. మండల పరిధిలోని కిష్టాపూర్, అల్లీపూర్, చెలుకలపల్లి, కమ్మర్లపల్లి, చౌడారం, అనంతసాగర్, చర్లఅంకిరెడ్డిపల్లి, మల్లా రం గ్రామాల్లో అటవీ ప్రాంతం అంతరించి పోయింది. మండలంలో అటవీ విస్తీర్ణం సు మారు రెండు వేల ఎకరాలకు పైగా ఉంది. గృహ నిర్మాణ సామగ్రి కోసం చెట్లను యథేచ్ఛగా నరికివేస్తున్నారు. దీంతో వన్య ప్రాణులు గ్రామాల్లోకి వస్తున్నాయి. వాటిని గ్రామస్తులు పట్టుకొని అటవీ అధికారులకు అప్పగిస్తున్నారు.

సమ్మక్క, సారలమ్మ జాతరకు రండి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

అక్కన్నపేట(హుస్నాబాద్): సమ్మక్క, సారలమ్మ జాతరకు రావాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను జాతర నిర్వహణ కమిటీ చైర్మన్ పెండ్యాల వెంకటస్వామి ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోవర్ధనగిరి గ్రామంలోని సంజీవ రాయి గుట్టపై కొలువుదీరిన సమ్మక్క, సారలమ్మ జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని సూచించారు. ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఉండేందుకు అన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ మెడబోయిన సారయ్య, జాతర నిర్వహణ కమిటీ సభ్యులు శ్రీనివాస్, కుమార్, పంగ వెంకటయ్య, బత్తుల సతీష్, వీరన్న ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సిద్దిపేటజోన్: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు భూపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎన్జీవో భవన్‌లో జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా చెల్లించాల్సిన 4 వాయిదాల కరువు భత్యం 14.56 శాతం (డీఏ)లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఒకటో తేదీన ఉపాధ్యాయుల వ్యక్తిగత ఖాతాల్లో జీతాలు జమ కాకపోవడం వల్ల బ్యాంకులతో అనేక సమస్యలు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రంగారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరి, కార్యదర్శి లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో..

వ్యక్తి ఆత్మహత్య



చంద్రం (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధి కొంతన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రా మస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అరికెల చంద్రం (30) కొన్నేళ్ల నుంచి కుటుంబ కలహాలతో ఇబ్బంది పడుతున్నాడు. శనివారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

భగీరథ.. తప్పని వ్యథ

- లక్ష్యానికి దూరంగా పథకం
- ఇంటింటికీ అందని నీళ్లు
- పైపులకు డైరెక్టుగా మోటార్లు బిగింపు
- ఊసేలేని మినీ వాటర్ ట్యాంకులు
- గ్రామాల్లో మొదలైన నీటి కష్టాలు

ప్రజలకు తాగునీటి సమస్యను తీర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పథకం మిషన్ భగీరథ లక్ష్యం నీరుగారిపోతోంది. ఇంటింటికీ నల్లా కనెక్షన్‌తో మంచి నీటిని అందించాలన్న లక్ష్యంతో ప్రారంభించిన ఈ పథకం పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. మిషన్ భగీరథ ఉన్నా.. మునిపల్లి మండలంలోని గ్రామాల ప్రజలకు మాత్రం నీళ్ల కోసం పరేషాన్ తప్పడం లేదు.

- మునిపల్లి(అందోల్)



మిషన్ భగీరథ నీళ్లు అందక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లో మిషన్ భగీరథ సిబ్బంది అమర్చిన పైపులైన్‌కు కొందరు కొత్తగా మోటార్లు బిగించి కనెక్షన్లు తీసుకుంటున్నారు. దీంతో గద్ద పైకి నల్లాలు ఉన్న వారికి నీళ్లు వెళ్లడం లేదు. పైపులైన్‌కు బోరుమోటార్లు పెట్టిన వారిపై కేసులు పెడుతామని అధికారులు చెప్పడమే కానీ ఇప్పటి వరకు మోటార్లు ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే రానురాను నీళ్ల కోసం ఇంకెన్ని తిప్పలు పడాల్సి వస్తుందో అని ఆందోళన చెందుతున్నారు.

వాటర్ ట్యాంకు వరకు వచ్చినా..

అనేక గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు వాటర్ ట్యాంకు వరకు వచ్చినా ఇంటింటికీ చేరడం లేదు. వెయ్యి రూపాయలిస్తే చాలు భగీరథ పైపులైన్‌కే నేరుగా కొత్త కనెక్షన్ ఇచ్చి ఇంటికి నీళ్లు వచ్చేలా సిబ్బంది చేస్తున్నారని ఆరోపణలున్నాయి. మోటార్ బిగించి కనెక్షన్ తీసుకొని నీళ్లను కొత్త ఇళ్ల నిర్మాణానికి, ఇతర పనులకు వాడుకుంటున్నారు. ఈ క్రమంలో గత మోటార్ కనెక్షన్ లేని వారికి నీరు అందడం లేదనే ఆరోపణలున్నాయి.

మినీ వాటర్ ట్యాంక్‌లు మాయం..

ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు గతంలో సర్పంచ్‌లు కాలనీ, వార్డుల్లో దిమ్మలు కట్టించారు. వీటిపై మినీ వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేసి నీటి సప్లయ్ చేశారు. ఈ క్రమంలో భగీరథ ట్యాంకు నుంచి మినీ వాటర్ ట్యాంకులకు ఉన్న పైపులు పగిలిపోవడం, పైపులకు మరమ్మతులు చేయకపోవడంతో మినీ ట్యాంకులు అలంకార ప్రాయంగా మారాయి. కొద్ది రోజుల కిందట వృథాగా ఉన్న మినీ వాటర్ ట్యాంకులను కొందరు ఇళ్లలో పెట్టుకొని వినియోగించుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు మిషన్ భగీరథపై దృష్టిసారించి నీళ్ల కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

రూ. 10 వేలు జరిమానా



మిషన్ భగీరథ పైపులైన్‌కు మోటార్లు పెడితే రూ.10 వేలు జరిమానా విధిస్తాం. గ్రామాల్లో ప్రజలందరికీ తాగునీరు అందించేందుకు మిషన్ భగీరథ ఏర్పాటు చేశాం. బోరు మోటార్లపై నేటి నుంచి పంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తారని తెలిపారు. ఎవరైనా బోరుమోటార్లు పెట్టినట్లు తెలిసినా, బోరుమోటార్లతో నీరు తీసుకుంటున్నట్లు తెలిసినా వెంటనే 984990321 నంబర్‌కు కాల్ చేయాలి. వారిపై చర్యలు తీసుకుంటాం.

– హరినందన్‌రావు, ఎంపీడీఓ

అలుపెరుగని జీవితం

- ఐదు పదుల వయస్సులోనూ పనులు
- ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్న హైమదీబేగం



సైకిల్‌పై కూరగాయలు తీసుకెళ్తున్న హైమదీబేగం

రామాయంపేట(మెదక్): నా అనేవారు ఉన్నా అందరికీ దూరంగా ఉంటున్న ఆ వృద్ధురాలు ఐదు పదుల వయస్సులోనూ అలుపెరుగని జీవితం కొనసాగిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుంది. పశువులను మేపు కుంటూ సైకిల్‌పై పశుగ్రాసం సరఫరా చేసుకుంటూ తన దైన శైలిలో జీవితం కొనసాగిస్తుంది.

రామాయంపేట పట్టణంలోని బీసీ కాలనీ నివాసం ఉంటున్న హైమదీబేగం (55) భర్త ఏడాది కిందట మృతి చెందాడు. కూతురు వివాహం చేయగా, కుమారుడు హైదరాబాద్‌లో పని చేసుకుంటున్నాడు. చనిపోయే ముందు భర్త ఆమెకు రెండు గేదెలను, సైకిల్‌ను ఇచ్చాడు. వాటిని పోషించుకుంటూ బతుకు వెళ్లదీసుకోమని భర్త చనిపోయే ముందు చెప్పాడని హైమదీబేగం భర్త జ్ఞాపకాలు నెమరు వేసుకుంటుంది. తనకంటూ ఎలాంటి ఆస్తి లేదని, రెండు గేదెలు, సైకిల్ మాత్రమే ఉన్నాయని చెప్పుకొచ్చింది. కూరగాయల వ్యాపారుల వద్ద నుంచి పాడైపోయిన వాటిని తీసుకొచ్చి రోజూ గేదెలకు పెడుతుంది. తనకు ఇంటి వసతి లేకపోవడంతో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నానని, ప్రభుత్వపరంగా ఇల్లు మంజూరు చేయాలని వేడుకుంటుంది. తనకు వస్తున్న పింఛన్ డబ్బులు ఖర్చులకు సరిపోవడంలేదని వాపోయింది.

ప్రభుత్వం ఆదుకోవాలి



తనకంటూ ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందకపోవడంతో గేదెలను పోషించుకుంటూ జీవిస్తున్నాను. పశుగ్రాసం కొనడానికి కూడా డబ్బులు లేక కుళ్లిపోయిన కూరగాయలు, మొక్కజొన్నల బూరు సైకిల్‌పై తెచ్చి పశువులు పెడుతున్నాను. ప్రభుత్వం తనను ఆదుకొని ఇల్లు మంజూరు చేయాలి.

హైమదీబేగం, రామాయంపేట

నేలపై కూర్చుని.. విద్యార్థులతో ముచ్చటించి

టేక్మాల్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండల పర్యటనలో భాగంగా ఆదివారం కేజీబీవీ పాఠశాల, మోడల్ స్కూల్‌లను మంత్రి దామోదర రాజనర్సింహ సందర్శించారు. కేజీబీవీలో బాలికలతోపాటు కింద కూర్చుని వారితో ముచ్చటించారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులు మంత్రికి స్వాగతం పలికే విధానం, మంత్రి ఎదుట విద్యార్థులు చేసిన యోగాసనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకోవడంతో శభాష్ అంటూ ఆయన అభినందించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకొని పూర్తి స్థాయిలో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. శంకుస్థాపన చేసిన నిధులతోపాటు మరో రూ.3 కోట్లు అదనంగా మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఒక్క గంటలో 10 చోట్ల చోరీ



ఘటన వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ లక్ష్మారెడ్డి



వైన్‌షాపు షెటర్ తెరిచిన దొంగలు

- జహీరాబాద్‌లో దొంగల బీభత్సం
- వైన్సులు, కిరాణా, బట్టల దుకాణాల పటర్లు లేపి దొంగతనాలు

జహీరాబాద్: పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున దొంగలు రెప్పపాటులో చోరీలకు పాల్పడ్డారు. ఒక్క గంటలోనే 10 ప్రాంతాల్లో చోరీలు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ముగ్గురు దొంగలు పల్సర్ వాహనంపై వచ్చి ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో బీదర్ క్రాస్‌రోడ్డు వద్ద గల వైన్స్‌లో చొరబడి సుమారు రూ.15 వేల నగదు ఎత్తుకెళ్లారు. అనంతరం పట్టణంలోని సుభాష్‌గంజ్‌లో గల చిదిరి సంగమేశ్వర్ కిరాణా షాపు షటర్ లేపి సుమారు రూ.20వేల వరకు చోరీ చేశారు. అలాగే, పక్కనే ఉన్న శివ ట్రేడర్స్ దుకాణం తలుపులు తీసినా దొంగతనం చేసేందుకు అవకాశం దక్కలేదు. అక్కడి నుంచి పాత రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలో ఉన్న దుల్హన్ వెడ్డింగ్ కలెక్షన్ దుకాణంలో రూ.16,550, సదా కలెక్షన్ సెంటర్‌లో రూ.2,500, అబుబకర్ దుకాణంలో రూ.2వేలు, లక్ష్మి బ్యాంగిల్ స్టోర్‌లో రూ.5వేల వరకు చోరీ జరిగినట్లు బాధితులు పేర్కొన్నారు. అల్గోల్ వెళ్లే దారిపై ఉన్న మద్యం దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. జర్నలిస్టు కాలనీలో మూడు ఇళ్ల తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. అన్ని ప్రాంతాల్లో కలిపి సుమారు రూ.80 వేల వరకు చోరీ జరిగినట్లు తెలుస్తోంది. దొంగలు ఎలాంటి పనిముట్లు వాడకుండా షటర్‌ను మధ్య భాగంలో పట్టుకొని ఒక్కసారిపై పైకెత్తడంతో లోపలకు వెళ్లేంత తెరుచుకున్నాయి. చోరీల విషయం తెలుసుకున్న ఎస్‌ఐ లక్ష్మారెడ్డి ఆయా ప్రాంతాలను సందర్శించి బాధితుల నుంచి వివరాలు సేకరించారు.

పక్క రాష్ట్రం వారనే అనుమానం

పట్టణంలో దొంగతనాలకు పాల్పడింది పక్క రాష్ట్రానికి చెందిన వారై ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఇందుకు సంబంధించి సీసీ ఫుటేజీల ఆధారంగా వారి ఆచూకీ కనుగొనే ప్రయత్నం చేస్తున్నామన్నారు. దొంగలు బైపాస్‌రోడ్డు నుంచి పారిపోయినట్లు అనుమానిస్తున్నారు.

భూసారం నిస్సారం



రసాయన ఎరువులను చల్లుతున్న రైతు

- విచ్చలవిడిగా రసాయన ఎరువుల వినియోగం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వ్యవసాయ శాఖ అధికారులు

దుబ్బాక: పంట పొలాలకు రైతులు విచ్చలవిడిగా రసాయన ఎరువులను వినియోగిస్తున్నారు. ఫలితంగా భూసారం తగ్గిపోతుంది. అధిక దిగుబడి వస్తుందనే ఆశతో అవసరమైన మేరకు కాకుండా ఎరువులు, పురుగుల మందులను అన్నదాతలు అధిక మోతాదులో వాడుతున్నారు. లైసెన్స్ పొందిన దుకాణాల నుండే ఎరువులు, మందులను కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నా కొంత మంది పట్టించుకోవడం లేదు. ఇలాంటి వారికి మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ సూచనలు సలహాలు...

అధికంగా రసాయన ఎరువుల వాడకం వల్ల పంటలకు నష్టం వాటిల్లడమే కాకుండా భూసారం తగ్గిపోతుంది. రైతులు సేంద్రియ ఎరువుల వైపు మొగ్గు చూపే ప్రయత్నం చేయాలి. వీటి ద్వారా నకిలీ ఎరువులు, పురుగు మందుల బెడద ఉండదు. పంటలకు తెగులు సోకితే రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకే పురుగుల మందులను పిచికారీ చేయాలి. కొనుగోలు చేసే మందు పేరు, రూపం, శాతం, పరిమాణం, జాగ్రత్తలు, విరుగుడు, తయారు చేసిన సంస్థ పేరు, గడువు క్షుణ్ణంగా పరిశీలించాలి. లేబుల్ లేని డబ్బాలు, సీసాలు, ప్యాకెట్లు కొనుగోలు చేయకూడదు. చెలామణిలో ఉన్న ఎరువులు, పురుగుల మందులను పోలిన ప్రత్యామ్నాయ పేరుతో విక్రయాలు జరుగుతుంటాయి. ఒక్కోసారి తక్కువ ధరకే ఎరువులు, పురుగుల మందులు అంటూ పల్లెల్లోకి వ్యాపారులు వస్తుంటారు వారిని నమ్మి రైతులు మోసపోవద్దని సూచించారు.

వీధి కుక్కల దాడిలో మేకలు మృతి



మృతి చెందిన మేకలు

మద్దూరు(హుస్నాబాద్): వీధి కుక్కల దాడిలో మేకలు మృతి చెందిన ఘటన మద్దూరు మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లో వెళ్తే.. నర్సాయిపల్లి గ్రామానికి చెందిన తుప్పతి ఎల్లయ్య మేకలను శనివారం దొడ్డిలో తోలాడు. రాత్రి సమయంలో ఊరిలో తిరిగే కుక్కలు దొడ్డిలోకి ప్రవేశించి మేకలపై దాడి చేశాయి. ఈ దాడిలో 7 మేకలు మృతి చెందగా, పలు మేకలకు గాయాలయ్యాయి. దాదాపుగా రూ.లక్ష నష్టం వాటిల్లిందని గ్రామస్తులు తెలిపారు.

చెరువులో పడి వృద్ధుడు మృతి

శివ్వంపేట(నర్సాపూర్): చెరువులో పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాజ్యం భిక్షపతి యాదవ్(70) స్థానిక చిన్న చెరువు వద్ద కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి మృతి చెందాడు. గుర్తించిన స్థానికులు చెరువులో గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.



మృతదేహాన్ని తీసుకొస్తున్న స్థానికులు

ఇంటిల్లిపాది ప్రభుత్వ ఉద్యోగులే..

- వేర్వేరు శాఖలో ఐదుగురు నియామకం
- ఆదర్శంగా నిలుస్తున్న కుటుంబం



ఉద్యోగాలు పొందిన పిల్లలతో తల్లిదండ్రులు (ఫైల్)

చేర్యాల(సిద్దిపేట): ఇంట్లో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం వస్తే చెప్పలేని సంతోషంగా ఉంటారు. అలాంటిది మండల పరిధిలోని కడవేర్గులో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు పొంది పలువురికి ఆదర్శంగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన గర్నెపెల్లి అంజయ్య యాదలక్ష్మి దంపతులకి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మధ్య తరగతి రైతు కుటుంబం అయినప్పటికీ వ్యవసాయం చేసుకుంటూ పిల్లలను చదివించారు. తల్లిదండ్రుల కష్టానికి ప్రతిఫలంగా పిల్లలందరూ ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించారు. పెద్ద కొడుకు గర్నెపల్లి ప్రశాంత్ ఇంజినీరింగ్ పూర్తి చేసి గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పంచాయతీ కార్యదర్శి నియామక ఎంపిక పరీక్షలో ప్రతిభకనబర్చి ఉద్యోగానికి ఎంపికై జగదేవపూర్ మండలంలో పనిచేస్తున్నాడు. చిన్న కుమారుడు గర్నెపల్లి అనిల్‌కుమార్ సీఏ కోర్సు పూర్తి చేసి ఈ మధ్య కాలంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన విద్యుత్‌శాఖ పరీక్షలో ప్రతిభ కనబర్చి అకౌంట్ ఆఫీసర్‌గా ఉద్యోగం పొందాడు. అలాగే, కూతురు గర్నెపల్లి వనజ డీఈడీ పూర్తి చేసి 2018లో విద్యాశాఖ నిర్వహించిన పరీక్షలో మంచి మార్కులు సాధించి స్పెషల్ టీచర్‌గా ఎంపికై మర్కూక్ మండలంలో పని చేస్తోంది. వీరితోపాటు ప్రశాంత్ భార్య గర్నెపల్లి దీక్ష ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నర్సింగ్ ఆఫీసర్ ఫలితాల్లో మూడవ జోన్‌లో 12 వ ర్యాంకు పొంది ఉద్యోగం సాధించారు. ఫిబ్రవరిలోనే నియామకం పత్రం అందుకొని సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విధులు నిర్వహిస్తుంది. అనిల్ కుమార్ భార్య గర్నెపల్లి ప్రత్యూష కేంద్ర ప్రభుత్వ బ్యాంకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో క్లర్కు ఉద్యోగం చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

గజ్వేల్‌రూరల్: కోళ్ల ఫారంలో విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన మండల పరిధిలోని పిడిచెడ్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన జంగపల్లి సాయిరెడ్డి(50) వ్యవసాయంతోపాటు కోళ్లఫారం నిర్వహిస్తున్నాడు. శనివారం సాయంత్రం విద్యుత్ లైట్లను వేసేందుకు ఫారంలోకి వెళ్లాడు. ఈ క్రమంలో స్విచ్ బోర్డు నుంచి విద్యుత్‌షాక్ తగలడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బొప్పాయి సాగు.. భలే బాగు

- సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు
- యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా పాటించాలి
- ఉద్యాన వనశాఖ అధికారి శైలజ సలహాలు, సూచనలు



జహీరాబాద్ ప్రాంతంలో సాగు చేస్తున్న బొప్పాయి తోట

జహీరాబాద్ టౌన్: బొప్పాయి.. పోషకాలు కలిగిన పండ్ల జాతిలో ముఖ్యమైంది. ఈ పండ్లలో ఏ,సీ విటమిన్‌తోపాటు ఐరన్, కాల్షియం, భాస్వరం వంటి పోషకాలు కూడా అధికంగా ఉంటాయి. బొప్పాయి పండుగానే కాకుండా వీటిని నుంచి పాలను సేకరించి పపెయిన్ అనే ఎంజైమ్‌ను తయారు చేస్తారు. మందుల తయారీలో ఎంజైమ్‌ను ఉపయోగిస్తారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో జిల్లా రైతులు బొప్పాయిని సాగు చేస్తున్నారు. జహీరాబాద్ ప్రాంతంలో కూడా అధిక విస్తీర్ణంలో తోటలు ఉన్నాయి.

- బొప్పాయి వివిధ తోటలతోపాటు పండిస్తారు. నీరు నిల్వలేని, నల్ల, ఎర్రనేలలు అనుకూలం.
- తొమ్మిది నెలల నుంచి రెండేళ్ల వరకు కాపునిచ్చే ఈ పంట లాభసాటిగా ఉంటుంది. పెట్టుబడి కూడా అధికంగా ఉంటుంది.
- భూమి దున్నడం కాడి నుంచి పంట చేతికి వచ్చే వరకు డ్రిప్ పరికరాలకు కలిపి ఎకరానికి లక్ష ఖర్చు అవుతుంది. సస్యరక్షణ చర్యలు చేపడితే లాభాలు మూడింతలుగా ఉంటుంది.
- మొక్కలు నాటిన ఆరు నెలల నుంచే పండ్ల దిగుబడి ప్రారంభం అవుతుంది. సాగు సమయంలో వైరస్, బ్యాక్టీరియా తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉంటుంది.
- భూమిని 30 నుంచి 40 మీటర్ల లోతుకు దున్నాలి. మొక్కకు మొక్కకు మధ్య 1.8 మీటర్ల దూరం ఉండేటట్లు గుంతుల తీయాలి. బొప్పాయికి తెగుళ్ల బెడద అధికంగా ఉంటుంది.
- ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరిస్తూ పంటను కాపాడుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జహీరాబాద్ ఉద్యాన వనశాఖ అధికారి శైలజ తెలిపారు.

తెగుళ్ల నివారణ..

- బొప్పాయికి మురుగునీరు నిలిచే నేలలు పనికిరావు. నీరు నిలిచే భూముల్లో కాండం కుళ్లు ఆశిస్తుంది.
- నీరు నిల్వ ఉండని నల్ల గరప, ఎర్రనేలలను ఎంచుకోవాలి. తెగుళ్ల వల్ల కాండం కుళ్లిపోయి చివరకు చెట్టు చనిపోతుంది. దీని నివాణరకు మొక్క మొదలు వద్ద నీరు నిల్వలేకుండా చూసుకోవాలి.
- కాపర్ ఆక్సీక్లోరైడ్ అనే మందును లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున కలిపి మొక్కల మొదళలో పోయాలి. బొప్పాయి మొదలళ్ల దగ్గర మట్టి ఎగదోసి డబుల్ రింగ్ పద్ధతిలో నీరు పెట్టాలి.
- డ్రిప్ ఇరిగేషన్ పద్ధతి ఇంకా మంచిది. బొప్పాయి తోటలకు ఆకు మచ్చ తెగులు ఆశిస్తే ఆకులపై తెల్లని గుండ్రని మచ్చలు ఏర్పడుతాయి. వీటి నివారణకు 2.5 గ్రాముల డైథేన్ ఎమ్–45 లీటరు నీటి చొప్పున కలిపి ఆకులు తడిచేలా పిచికారీ చేయాలి.
- కాయలు పక్వానికి వచ్చే దశలో ఈఁబెడ ఉంటుంది. ఇవి కాయలను తీవ్ర నష్టాన్ని కలుగజేస్తాయి. వీటి నివారణకు మిథైల్ యుజినల్ ఎరబుట్టలను ఉపయోగించి ఈగలను ఆకర్షించేలా చేయాలి.
- పిండినల్లి తెగులు నివారణకు 2 మిల్లీలీటర్ల ప్రొఫినోఫాస్.. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నులి పురుగుల నివారణకు 250 గ్రాముల వేప పిండి, కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు, సుడోమొనాస్ ఫ్లోరిసెన్స్ 4 గ్రాముల చొప్పున ఒక్కో మొక్కకు వేయాలి.
- మొక్కలు నాటిన రెండో నెలల నుంచి 45 రోజులకు ఒకసారి ఆరు దఫాలుగా 250 గ్రాముల నత్రజని, 250 గ్రాముల భాస్వరం, 500 గ్రాముల పొటాష్ నిచ్చే ఎరువులను వేయాలి.

టీ తాగి నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా..

కారు ఢీకొని మహిళ మృతి



అజ్మీర గమ్మి మృతదేహం

కౌడిపల్లి(నర్సాపూర్): మహిళను వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన కౌడిపల్లి మండలం ధర్మాసాగర్ గేట్ తండా వద్ద చోటు చేసుకుంది. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్త చెరువు తండా పంచాయతీ మహ్మద్‌నగర్ గేట్ తండాకు చెందిన అజ్మీర గమ్మి(65) ఆదివారం రాత్రి ధర్మాసాగర్ గేట్ వద్దకు టీ తాగేందుకు వచ్చింది. టీ తాగిన అనంతరం 765డి జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా మెదక్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న స్కార్పియో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై అజ్మీర అక్కడికక్కడే మృతి చెందింది. వాహనం ఆపకుండా డ్రైవర్ వెళ్లిపోయాడు. గమనించిన తండావాసులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నర్సాపూర్‌లో వాహనాన్ని గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.